క్లుప్తంగా

విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో గణేశ్

కుంటాల: రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఏఈవో గణేశ్ కోరారు. గురువారం మండలంలోని విఠాపూర్‌లో ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. పంట దిగుబడి వచ్చే వరకు కొనుగోలు రశీదు భద్ర పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో సందడి



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం గోపూజ, బాబాకు అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతిలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

డ్రైయినేజీ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పరిశీలించారు. బస్టాండ్ సమీపంలోని ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ పేర్కొన్నారు. అనంతరం విద్యానగర్ కాలనీలో భగీరథ నీరు రాకపోవడంతో వాటర్‌ట్యాంక్ వద్ద నూతన గేట్‌వాల్ ఏర్పాటు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ పరిమి లత సురేశ్, నాయకులు జన్నారపు శంకర్, షబ్బీర్ పాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించే నీట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన పొద్దుటూరు మైపాల్‌రెడ్డి–సౌజన్య దంపతుల కుమార్తె సహస్ర రెడ్డి 14,900 ర్యాంక్ సాధించారు. ఈసందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని మైపాల్‌రెడ్డి నివాసంలో దివ్య డీలక్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు విద్యార్థినిని ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దివ్య డీలక్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, అధ్యక్షుడు లింగాగౌడ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ



రాజారాం మనోజ్

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన రాజారాం మనీషా–ముకేశ్ దంపతుల కుమారుడు రాజారాం మనోజ్ నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. 720 మార్కులకు గాను 507 మార్కులు సాధించిన మనోజ్‌ను పలువురు అభినందించారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని రోగులకు ఆ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక జగన్నాథ్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. నడింపల్లె గ్రామానికి చెందిన కొక్కుల శేఖర్ పలువురు పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశాడు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు రాజగంగన్న, రామునాయక్, ఖలీల్, ప్రదీప్, రాజు, సుమిత్, గజేందర్, రాజన్న, సుమన్, శ్రావణ్, నరేందర్, ప్రణీత్, లింగన్న, ధర్మరాజు, సంతోష్, ప్రసాద్, రమేశ్, శ్రీనివాస్, గంగన్న, తిరుమలేశ్, మధు, శ్రీకాంత్, శేఖర్, అజయ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్య.. తీరనున్న వ్యథ

- కుంటాల జూనియర్ కళాశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు
- సమీప ప్రాంతాల విద్యార్థులకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కుంటాలలో జూనియర్ కళాశాల భవనం

కుంటాల: పేదవిద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో గతేడాది కుంటాల మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. ఈ విద్యాసంవత్సరం (2024–25) నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. అందులో భాగంగా కళాశాలలో ఇప్పటికే 40 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. ఫీజులు చెల్లించి ప్రైవేటుకు వెళ్లని మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఈ కళాశాల ఏర్పాటు వరంగా మారింది. గతంలో ఇక్కడ కళాశాల లేకపోవడంతో మండల విద్యార్థులు నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లి మాధ్యమిక విద్య(ఇంటర్) అభ్యసించేవారు.

పాఠశాల భవనంలో ఏర్పాటు..

కుంటాలలో కళాశాల ఏర్పాటు చేయడంతో భైంసా మండలంలోని తిమ్మాపూర్, నర్సాపూర్ (జి) మండల కేంద్రంతోపాటు గొల్లమాడ, చాక్‌పల్లి, తురాటి, నందన్, బామ్ని(బీ) గ్రామాల విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రస్తుతం కళాశాలకు సొంత భవనం లేదు. కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న భవనంలో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దూర ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బంది కల్గకుండా బీసీ వసతిగృహంలో వసతి కల్పించాలని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు.

ప్రారంభమైన అడ్మిషన్లు..

కుంటాల జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కళాశాలకు అవసరమయ్యే సామగ్రిని దాతలు విరాళంగా అందిస్తున్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయి.



విఠాపూర్‌లో ప్రచారం చేస్తున్న గ్రామస్తులు

ఒక్కో గ్రూపులో 44 సీట్ల వరకు ఉన్నట్లు అధ్యాపకులు తెలిపారు. ఇప్పటివరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆయా గ్రూపుల్లో 40 మంది ప్రవేశం పొందినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తుకారాం పేర్కొన్నారు.

కళాశాలలో చేరాలని గ్రామస్తుల ప్రచారం..

ప్రభుత్వ కళాశాలలో చేరి.. నాణ్యమైన విద్య అందుకోవాలని ఇప్పటికే కుంటాల గ్రామస్తులు నర్సాపూర్ (జి), భైంసా, కుంటాల మండలాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన వారి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో అందించే పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, రాత పుస్తకాలు తదితర సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సంతోషంగా ఉంది.



గతంలో కుంటాలలో జూనియర్ కళాశాల లేక పట్టణాలకు వెళ్లి ఇంటర్ చదువుకునేవారు. ఇప్పుడు మండల కేంద్రంలోనే కళాశాల చేయడం సంతోషంగా ఉంది. దూరప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

– హరి, విద్యార్థి, అంబుగామ

అందరి సహకారంతోనే..



ప్రభుత్వం గతేడాది కుంటాలకు జూనియర్ కళాశాల మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అందరి సహకారంతో ముందుకెళ్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తున్నాం.

– పరశురాం, డీఐఈవో

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకర గుంత పూడ్చివేయరూ



తానూరు: మండల కేంద్రం నుంచి ముధోల్ వెళ్లే డబుల్ రోడ్డుపై దాగాం బస్టాప్ వద్ద ఏర్పడిన గంత ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వచ్చేవరకు గుంత తెలియక ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 96663 31486

ప్రతిపాదనలు పంపిస్తాం

సాక్షి స్పందన

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఎంఈవో మధుసూదన్ అన్నారు. 'బడి ఇలా.. చదివేదెలా..' శీర్షికన ఈనెల 6న గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి పాఠశాల పరిశీలించారు. ఇప్పటికే మండలంలోని 17 పాఠశాలల్లో మన ఊరు–మన బడి ద్వారా అదనపు గదులు, ఇతర నిర్మాణాలు చేపట్టామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మండలంలోని 38 పాఠశాలల్లో పలు రకాల పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో మరమ్మతుల నిమిత్తం డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు వివరించారు.



తిమ్మాపూర్ పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈవో మధుసూదన్

సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పించాలి

- డీపీవో శ్రీనివాస్
- గ్రామాల్లో ప్రారంభమైన బడిబాట



కుంటాలలో ర్యాలీలో పాల్గొన్న డీపీవో శ్రీనివాస్, అధికారులు

కుంటాల: నాణ్యమైన విద్య అందిస్తున్న సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించాలని డీపీవో శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా వీధుల్లో ర్యాలీ తీసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎం రహీం, ఎంఈవో ముత్యం, హెచ్ఎం సక్రపు గజేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: బడీ ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. మన్మద్, లోకేశ్వరం, పుస్పూర్, గడ్‌చాంద, రాజూర, పంచగుడి, ధర్మోర గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామాల్లో ర్యాలీలు తీశారు.

తానూరు: మండలవ్యాప్తంగా బడిబాట నిర్వహించారు. తానూరులో జెడ్పీ పాఠశాల హెచ్ఎం సాయిబాబు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎల్వీలో అంగన్‌వాడీ టీచర్లు ఇళ్లకు వెళ్లి చిన్నారుల వివరాలు సేకరించారు. ఉపాధ్యాయులు గంగుల చిన్నన్న, రమేశ్, అయుబ్, దత్తాత్రి, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కిషన్‌రావు ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీర్సాపాటిల్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంబి: మండల కేంద్రంతోపాటు మందపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో బడిబాట నిర్వహించారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్య, సౌకర్యాలు వివరించారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పలు చోట్ల కార్యక్రమాన్ని ఎంఈవో మధుసూదన్ పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భైంసారూరల్: ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో సుభాశ్ అన్నారు. మండలంలోని వానల్‌పాడ్, మిర్జాపూర్, చింతల్‌బోరి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీటీచర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో బడిబాట ప్రారంభించారు. వీధుల్లో ర్యాలీలు తీసి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలను వివరించారు. వడ్యాల్ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రాంప్రసాద్, ప్రధానోపాధ్యాయులు అశోక్ వర్మ, లక్ష్మణచాంద ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, సీఆర్పీ సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వవిద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలవ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు ర్యాలీలు తీసి బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. బీరవెల్లిలో ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించారు. ఉపాధ్యాయులు సాయన్న, విద్యాసాగర్, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.



సోన్: న్యూవెల్మల్‌లో ర్యాలీలో ఉపాధ్యాయులు



లోకేశ్వరం: మన్మద్‌లో ర్యాలీ తీస్తున్న సిబ్బంది



నర్సాపూర్(జి): ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు



భైంసాటౌన్‌లోని మదీనా కాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఖానాపూర్ : మస్కాపూర్‌లో ర్యాలీలో ఉపాధ్యాయులు, సిబ్బంది



తానూరు మండలం ఎల్వీలో ఇంటి వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంప్రసాద్

దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకుని దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. ‘ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే’అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడెం, జన్నారం తదితర మండలాలు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు ఫోన్ చేసి ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. నీరు, రోడ్డు, డ్రైనేజీ, కరెంట్, మిషన్ భగీరథ, జీవో నంబర్–3, ఫారెస్ట్, జీవో నంబర్–317 తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తేగా సీఎం, మంత్రుల చొరవతో దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వరికొయ్యలకు నిప్పు.. పంట దిగుబడికి ముప్పు



తర్లపాడ్‌లో పొలంలో కాలుతున్న వరికొయ్యలు

ఖానాపూర్: పంట కోసిన తర్వాత పొలంలో వరికొయ్యలను కాల్చడం ద్వారా భూమిలో సారం తగ్గిపోతుంది. మంటల్లో పంట దిగుబడిని పెంచే సూక్ష్మక్రిములు, మిత్రపురుగులు, క్రిమికీటకాలు చనిపోతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. దీంతో కాలుష్యం ఏర్పడి పొలాలు నల్లగా మారుతున్నాయి. పశువులకు ఆహార కొరత ఏర్పడుతుంది. గాలిదుమారం వస్తే మంటలు ఇళ్లలోకి వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. సమీపంలోని మొక్కలు కూడా చనిపోతున్నాయి.

ఇలా చేస్తే మేలు..

వరికొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ ఎరువు, కార్బన్‌శాతం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి. బురదలో గడ్డి అవశేషాలు మురిగిపోయి సేంద్రీయ ఎరువుగా మారుతుంది. భూమిలో నీటి నిల్వలు కూడా పెరుగుతాయి. దీనిపై వ్యవసాయశాఖ, రైతు సహకార సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పించడం ద్వారా నష్ట నివారణ చర్యలను అరికట్టవచ్చు.

గ్రామాల్లో వర్షం.. రైతుల హర్షం



లక్ష్మణచాంద: చింతల్‌చాందలో చేనులో నీరు



ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు..

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం వర్షం కురువడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు చోట్ల సాగు పనులు ప్రారంభించినా పూర్తిస్థాయిలో వర్షాలు కురువలేదు. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు తగ్గలేదు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి చేన్లలో నీరు నిలిచింది. రైతులు విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమయ్యారు.

తానూరు: మండల కేంద్రంతోపాటు జౌలా(బి), సింగన్‌గాం తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. రైతులు కూడా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

కుంటాల: మండలంలోని ఓలా, కుంటాల, వెంకూర్, విఠాపూర్ గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఇటీవల రైతులు చేన్లలో పత్తి విత్తనాలు విత్తారు. ఈ వర్షంతో విత్తనాలు మొలకెత్తుతాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపూర్: పట్టణంలో గురువారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడ్డ ప్రజలు ఉపశమనం పొందారు. పలు చోట్ల డ్రెయినేజీలు సక్రమంగా లేక ప్రధానరోడ్లు కుంటలను తలపించాయి. వర్షం తగ్గిన తర్వాత మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం సిబ్బందితో దగ్గరుండి డ్రెయినేజీల్లో పూడిక తీయించి.. రోడ్లపై నీరు లేకుండా చర్యలు చేపట్టారు. చిన్నపాటి వర్షానికే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే.. వర్షాకాలంలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ఎంపీ నగేశ్

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్ గురువారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన నగేశ్ మొదటిసారిగా ఢిల్లీ వెళ్లారు. భారీ మెజార్టీతో గెలుపొందిన నగేశ్‌ను కిషన్‌రెడ్డి అభినందించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ జెడ్పీటీసీ అశోక్ ఉన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోడం నగేశ్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్



తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కుంటాల: నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని టెక్నికల్ ఏడీఏ విద్యాసాగర్, టీఎస్ సీడ్స్ మేనేజర్ అతుల్ కుమార్ జైన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కల్లూర్ ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. విత్తనాలను విడిగా విక్రయించడం నిషేధమని పేర్కొన్నారు. రోజు క్రయ విక్రయాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో టెక్నికల్ ఏవో వినోద్, ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు గణేశ్, శ్రీధర్, మహేశ్, ప్రగతి ఉన్నారు.